సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 4 । అక్టోబర్ । 2023



విద్యకు అధిక ప్రాధాన్యం
సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యమిస్తూ కార్యక్రమాలు ప్రవేశపెడుతున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర అన్నారు.

8లో



ఫీడర్ అంబులెన్సులో ప్రసవం
ఫీడర్ అంబులెన్సులో ఆస్పత్రికి తరలిస్తుండగా గర్భిణి మార్గం మధ్యలో ప్రసవించింది. తల్లీబిడ్డ క్షేమంగానే ఉన్నారు.

8లో



క్రీడల్లో రాణించేలా ప్రోత్సాహం
విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై రాణించేలా ప్రోత్సహిస్తున్నామని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు.

8లో

న్యూస్‌రీల్

వెదురుకొక్కులు భలే రుచి!
• జోరుగా విక్రయాలు



పాడేరు పాత బస్టాండ్‌లో వద్ద బుట్టలతో వెదురు కొక్కులు

సాక్షి,పాడేరు: వెదురు కొక్కుల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. పుట్టగొడుగులను పోలి ఉండే ఇవి వెదురు మొద్దల్లో లభ్యమవుతాయి. పుట్టగొడుగుల కన్నా రుచిగా ఉండే వీటిని మన్యం వాసులతో పాటు మైదాన ప్రాంత ప్రజలు ఎంతో ఇష్టంగా తింటారు. మంగళవారం ఉదయం స్థానిక పాతబస్టాండ్ వద్ద మార్కెట్‌కు వంట్లమామిడి, వనుగుపల్లి పంచాయతీలకు చెందిన గిరిజనులు బుట్టలతో వెదురుకొక్కులను తీసుకువచ్చారు. వీటిని బుట్ట రూ.800కు విక్రయించారు. వ్యాపారులు వీటిని వాటాలు వేసి ఒకొక్కటి రూ.100కు రిటైల్‌గా విక్రయించారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఐదుగురి ఎంపిక



విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందించి అభినందిస్తున్న హెచ్ఎం ముత్యాలరావు

దేవీపట్నం: జాతీయస్థాయిలో నిర్వహించిన నేషనల్ మెరిట్ కం మీన్స్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షల్లో ఇందుకూరుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్టు హెచ్ఎం వి.ముత్యాలరావు తెలిపారు. పాఠశాలలో చదువుతున్న గొర్రిల మంజుల, శరకణం నాగచైతన్య శ్రీగణేష్, కాసాని వీరవెంకట రామకృష్ణ, మూలపర్తి వాణి సంజన, ఇజ్జన సాయి అలెక్స్ స్కాలర్ షిప్ పొందేందుకు అర్హత సాధించారని ఆయన పేర్కొన్నారు. వీరికి కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.12 వేల చొప్పున ఐదేళ్లపాటు అందిస్తుందని ఆయన వెల్లడించారు. ఏటా ఈ పరీక్ష నిర్వహిస్తారని, ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులన్నారు. ఎంపికైన విద్యార్థులను ఎస్ఎంసీ చైర్మన్ గొర్రిల శ్రీను, ఉపాధ్యాయులు అభినందించారు.

జి20 సదస్సుకు మారేడుమిల్లి ఏకలవ్య విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ అరుణకుమారి, సిబ్బంది

మారేడుమిల్లి : జీ20 యువమంథన్ సదస్సుకు స్థానిక ఏకలవ్య పాఠశాల విద్యార్థులు మమత, నాగలక్ష్మి, లోవరెడ్డి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ టి.అరుణకుమారి తెలిపారు. వీరు వచ్చే నవంబర్‌లో ఢిల్లీలో జరిగే జాతీయ సదస్సులో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు



సాక్షి, పాడేరు: పట్టణంలోని పాత ఆస్పత్రి సెంటర్‌లో ఈనెల 21వతేదీ నుంచి 25వరకు జరిగే విజయదశమి ఉత్సవాలకు నూతన కమిటీ మంగళవారం ఏర్పాటైంది. ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శివరాత్రి నాగేశ్వరరావు, బొజ్జా సూర్యనాగును పెద్దలు ఎన్నుకున్నారు. మరికొంతమంది కార్యవర్గంలో ఉన్నారు.

19 మందికి స్పాట్ అడ్మిషన్లు



స్పాట్ అడ్మిషన్లకు హాజరైన విద్యార్థులు

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ ఆదర్శ ఆశ్రమ పాలిటెక్నిక్‌లో ఖాళీగా ఉన్న సీట్లకు సంబంధించి మంగళవారం నిర్వహించిన స్పాట్ అడ్మిషన్ల కార్యక్రమం ప్రశాంతంగా జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సుజాత పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. సివిల్‌లో 20 సీట్లు,ఎలక్ట్రికల్‌లో 41, మెకానికల్‌లో 20సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించారు. సివిల్‌లో 7గురు, మెకానికల్‌లో 7గురు, ఎలక్ట్రికల్‌లో ఐదు మంది విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లు పొందారు. వీరంతా బుధవారం నుంచి తరగతులకు హాజరవుతారని ప్రిన్సిపాల్ తెలిపారు.

దరిలో వైద్యం



హుకుంపేట మండలం శోభకోటలో వైద్యశిబిరం వద్ద బారులు తీరిన గిరిజనులు



జి.మాడుగుల మండలం బందవీధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి పెద్ద ఎత్తున వచ్చిన గిరిజనులు



ముంచంగిపుట్టు మండలంలో గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో నిర్వహించిన వైద్యశిబిరం



రాజవొమ్మంగి మండలం శరభవరంలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరానికి విచ్చేసిన రోగులు

గిరిలో వరి సిరులు



హుకుంపేట మండలం బలోర్ద ప్రాంతంలో ఏపుగా పెరిగిన వరి పైరు



హుకుంపేట మండలం రంగశీలలో కంకులతో కళకళలాడుతున్న వరి పైరు

జిల్లాలో ఖరీఫ్ సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలించాయి. వరి పైరు కంకులు, గింజలతో కళకళలాడుతోంది. ఆశాజనకంగా ఉండటంతో గిరి రైతులకు సిరులు కురిపించనుంది.

- ఆశాజనకంగా పైరు
- కంకులు, గింజలతో కళకళ
- అనుకూలించిన వాతావరణం
- ఆదుకున్న రైతు భరోసా
- సకాలంలో సాగు

సాక్షి,పాడేరు : ఒకపక్క ప్రభుత్వ సాయం.. మరోపక్క అనుకూలించిన వాతావరణం.. వరి సాగు చేపట్టిన రైతులకు ఉపకరించాయి. పైరు ఏపుగా పెరుగుతుండటంతో గిరి రైతుల్లో ఆనందం నెలకొంది. జిల్లాలో ఈఏడాది ముందుగానే తొలకరి వర్షాలు ప్రారంభమయ్యాయి. ఖరీఫ్ వ్యవసాయ పనులను రైతులు సకాలంలోనే ప్రారంభించారు.

90 శాతం రాయితీపై..

ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా జిల్లా వ్యాప్తంగా 17,500 క్వింటాళ్ల విత్తనాలను 90శాతం రాయితీపై ముందుగానే పంపిణీ చేసింది. పెట్టుబడికి ఇబ్బందులు లేకుండా రైతుల ఖాతాల్లో రైతు భరోసా సొమ్ము జమచేసింది. వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో విత్తనాలు పొందిన రైతులంతా సకాలంలో నారుమళ్లను వేసుకున్నారు. నాట్లు కూడా ఉత్సాహంగానే పూర్తి చేశారు.

50,436 హెక్టార్లలో సాగు..

జిల్లావ్యాప్తంగా 50,436 హెక్టార్లలో నాట్లు వేసినట్టు వ్యవసాయ, రెవెన్యూ శాఖలు ఈక్రాప్‌లో నమోదు చేశాయి. పాడేరు,రంపచోడవరం డివిజన్‌ల పరిధిలో పైరు ఆశాజనకంగా ఉంది. చింతూరు డివిజన్‌లో వరదల ప్రభావం కారణంగా సాగు విస్తీర్ణం తగ్గింది. పైరుపై చీడపీడల ప్రభావం లేనట్టు ఈక్రాప్ సిబ్బంది గుర్తించారు. పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల, పెదబయలు, అరకులోయ, డుంబ్రిగుడ ప్రాంతాల్లో పైరు కంకి, గింజ దశలో ఉంది.

దిగుబడులు పెరిగే అవకాశం




ఖరీఫ్ వరి సాగుకు అన్నికాలుగా పరిస్థితులు కలిసొచ్చాయి. పైరుపై చీడపీడల ప్రభావం లేనందున దిగుబడులు పెరిగే అవకాశం ఉంది. రైతులకు సకాలంలో వరి విత్తనాలు పంపిణీ చేయడం వల్ల నారుమళ్లు, నాట్లను సకాలంలో వేయగలిగారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పైరుకు మేలు చేస్తున్నాయి.

– ఎస్‌బీఎస్ నందు, జిల్లా వ్యవసాయాధికారి

బొర్రాకు పోటెత్తిన పర్యాటకులు

మూడు రోజుల్లో రూ.10.11 లక్షల ఆదాయం



బొర్రా గుహలను తిలకిస్తున్న పర్యాటకులు



బొర్రా గుహల వద్ద పర్యాటకుల సందడి

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు పర్యాటకులు పోటెత్తారు.. సహజసిద్ధంగా ఏర్పడిన గుహలు అందాలను తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటుగా పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. శని, ఆది, సోమవారాల్లో పెద్ద ఎత్తున పర్యాటకులు రావడంతో భారీగా ఆదాయం సమకూరింది. శనివారం 3200 మంది తిలకించగా 2.60 లక్షలు, ఆదివారం 5072 మంది తిలకించగా రూ.4.21 లక్షలు, సోమవారం 3500 మంది తిలకించగా రూ. 3.30 లక్షల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు.

• సాయంసంధ్యవేళ.. సప్తవర్ణ శోభితం



సాయంసంధ్యవేళ అద్భుత దృశ్యం మండలకేంద్రం రాజవొమ్మంగిలో మంగళవారం ఆవిష్కృతమైంది. సూర్యుడు అస్తమిస్తున్న వేళ కాన్వాయ్‌ను తలపించేలా ఈ అపురూప దృశ్యం కనువిందు చేసింది.

– రాజవొమ్మంగి

ఆరోగ్యశాఖ మంత్రికి ఘన స్వాగతం



మంత్రి విడదల రజనీకి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, కార్యకర్తలు



కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్‌తో సమీక్షిస్తున్న మంత్రి రజని



మంత్రి విడదల రజనీకి సెల్యూట్ చేస్తున్న జాగిలం

అనంతగిరి: మండల పర్యటనకు మంగళవారం అనంతగిరి విచ్చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనీకి ఘన స్వాగతం లభించింది. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, మండల నాయకులు, కార్యకర్తలతో పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. సీహెచ్‌డబ్ల్యూల సమస్యలను మంత్రికి ఎంపీపీ శెట్టి నీలవేణి వివరించారు. వారికి పదోన్నతి కల్పించాలని, అలాగే అనంతగిరి పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలని ఆమె మంత్రిని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. వైద్యాధికారులను, వైద్య సిబ్బందిని, మంత్రి రజని ఆప్యాయంగా పలకరించారు. ఆమెతో ఫొటోలు దిగేందుకు నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది పోటీపడ్డారు. మధ్యాహ్నం భోజనం అనంతరం ఆమె అరకు వెళ్లారు. ఐటీడీఏ పీవో అభిషేక్, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ సూర్యనారాయణ, నాగేశ్వరరావు, మధుసూదన్, దానియేలు, సంపత్, సాంబ, నవీన్, గంగరాజు పాల్గొన్నారు.

జాగిలం సెల్యూట్..

అనంతగిరి హరిత రిసార్ట్స్ వద్ద రాష్ట్ర ఆరోగ్యశాఖా మంత్రి విడదల రజనీకి పోలీసు జాగిలం సెల్యూట్ చేస్తూ అందరినీ ఆకట్టుకుంది. దీనిని అక్కడ ఉన్న వారంతా ఆసక్తిగా తిలకించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలపై మంత్రి సమీక్ష

సాక్షి, పాడేరు: జిల్లాలో నిర్వహిస్తున్నజగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలపై రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనీ మంగళవారం అరకులోయ రైల్వే అతిథి గృహంలో సమీక్షించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను కలెక్టర్ సుమిత్‌కుమార్ మంత్రికి వివరించారు. జిల్లా వ్యాప్తంగా వైద్యశిబిరాలకు విశేష స్పందన లభిస్తోందన్నారు. వైద్యనిపుణులతో రోగులకు పరీక్షలు నిర్వహించడంతోపాటు ఉన్నత వైద్యానికి రిఫర్ చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. అరకు నియోజకవర్గంలోని సురక్ష శిబిరాల వివరాలను ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి రజని అరకులోయ పద్మాపురం గార్డెన్, గిరిజన మ్యూజియాన్ని సందర్శించారు.ఇలావుండగా అరకులోయ విచ్చేసిన మంత్రికి కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, పాడేరు ఏఎస్పీ ధీరజ్ స్వాగతం పలికారు. బుధవారం ఉదయం డుంబ్రిగుడ మండలం కిల్లోగుడ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, యండపల్లివలసలోని గిరిజన గురుకుల కళాశాలల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను మంత్రి రజనీ ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీసుశాఖ భద్రతా చర్యలను విస్తృతం చేసింది.

6న మినీ జాబ్ మేళా

మురళీనగర్ (విశాఖ): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలోని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా కార్యాలయంలో ఈ నెల 6న మినీ జాబ్ మేళా నిర్వహించనున్నామని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి సాయికృష్ణ చైతన్య తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు యకోహామా టైర్స్ కంపెనీలో 100 పోస్టుల భర్తీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

శభాష్ వలంటీర్లు



పండన్నకు పింఛను అందజేస్తున్న అరుణ్‌కుమార్



మల్కన్‌గిరి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మికి పింఛను అందజేస్తున్న వలంటీర్ శ్రీను

సాక్షి,పాడేరు: విశాఖలోని ఎస్ఆర్ఐ ఆస్పత్రిలో ప్రాణాంతక వ్యాధితో చికిత్స పొందుతున్న వృద్ధుడు గాలంగి పండన్న వద్దకు వలంటీర్ వెళ్లి వైఎస్సార్ పింఛను కానుక సొమ్ము అందజేశాడు. జి.మాడుగుల మండలంలోని కిల్లంకోట పంచాయతీ సుర్తిపల్లి గ్రామానికి చెందిన పండన్న 20 రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈవిషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ మోనిపల్లి విజయ్ అరుణ్‌కుమార్ 170 కిలోమీటర్ల దూరంలోని విశాఖలోని ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేశాడు. ఇందుకు అయిన రూ.400 చార్జీలకు వలంటీర్ సొంత సొమ్మును వెచ్చించాడు.

చింతూరు: ఆపదలో ఉన్న వారికి సకాలంలో సంక్షేమ పథకాలు అందజేస్తూ వలంటీర్లు ఆదర్శంగా నిలుస్తున్నారు. మండలంలోని ఇంతులూరు వాగుకు చెందిన వైఎస్సార్ కానుక పింఛను లబ్ధిదారు కిలో లక్ష్మి అనారోగ్యంతో ఒడిశాలోని మల్కన్‌గిరి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ శ్రీను మంగళవారం అక్కడికి వెళ్లి ఆమెకు పింఛను అందజేశాడు.

జగనన్న ఆరోగ్య సురక్ష గిరిజనులకు వరం

- వైద్యసేవలు మరింత చేరువ
- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి
- 600 మంది రోగులకు సేవలు



ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి ఆరోగ్య పరీక్ష చేస్తున్న డాక్టర్ నర్సింగరావు



శోభకోటలో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



బందవీధిలోని జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో రోగిని పరీక్షిస్తున్న జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి



ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: జగనన్న ఆరోగ్య సురక్ష గిరిజనులకు ఒక వరమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలో కె.కోడాపల్లి గ్రామ సచివాలయ పరిధి బాలికల ఆశ్రమోన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నర్సింగరావుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులకు అందని ద్రాక్షగా మారిన వైద్యాన్ని తమ ప్రభుత్వం వారికి మరింత చేరువ చేసిందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఇంటింటా సర్వేలో సేకరించిన వివరాలు ఆధారంగా వైద్య శిబిరాల్లో ఉచిత సేవలు ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఇవి 45రోజుల పాటు కొనసాగుతాయని వారు అన్నారు. గ్రామ వలంటీర్లు, వైద్య సిబ్బంది సేకరించిన ఆరోగ్య సమాచారం ఆధారంగానే భవిష్యత్తులో వారందరికీ కూడా వైద్య సేవలు ప్రత్యేక నిపుణుల అధ్వర్యంలో ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఈ శిబిరంలో 600మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ మత్స్యరాస వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, సర్పంచ్ మాతే చిలకమ్మ, సీదరి కొండబాబు, ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర, చిన్నారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎస్. మత్స్యకొండంనాయుడు, సచివాలయ మండల కన్వీనర్ ఎల్ కల్యాణం, జగనన్న ఆరోగ్య సురక్ష జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రమేష్, ఎంపీపీ కె.పద్మ, ఎంపీడీవో చంద్రశేఖరరావు, ఎంఈవో బాబూరావు పడాల్, ఏటీడబ్ల్యూవో తిరిపాల్, వైద్యాధికారులు శశికాంత్, రవిచంద్రశేఖర్,వి ఘ్నేష్ పాల్గొన్నారు.

నేను సైతం... : రోగులను పరీక్షించిన జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి

జి.మాడుగుల: మండలంలో కె.కోడాపల్లి ఆశ్రమ పాఠశాలలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నేను సైతం అంటూ వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతం కావాలని ఆమె ఆకాంక్షించారు. ఇందులో భాగంగా తాను కూడా రోగులకు వైద్య పరీక్షలు చేసి తనవంతు సహాయం అందిస్తానని ఆమె పేర్కొన్నారు. రోగులకు వైద్య పరీక్షల అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు.


పల్లెల్లో ఆరోగ్య విప్లవం : ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పల్లెల్లో ఆరోగ్య విప్లవం ఏర్పడిందని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మంగళవారం స్థానిక గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల-2లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా ప్రజల చెంతకు వైద్య సేవలు తీసుకురావడం అన్నది సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణే జగనన్న ధ్యేయమన్నారు. అంతకు ముందు చైర్‌పర్సన్ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పాడేరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, ఎంపీపీ అరిసెల సీతమ్మ,పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబందు, ఎంపీడీవో రమేష్, వైద్య నిపుణుల, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరావు, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, సర్పంచ్‌లు రమేష్, నీలకంఠం,గంగాధర్ పాల్గొన్నారు.

పేదల జీవితాలకు రక్ష

హుకుంపేట: జగనన్నఆరోగ్య సురక్ష పేదల జీవితాలకు రక్ష అని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మంగళవారం మండలంలోని శోభకోటలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. గిరిజనులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఏరాష్ట్రంలో లేనివిధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా క్షయ నివారణ అధికారి డా. విశ్వేశ్వరనాయుడు మాట్లాడుతూ జగనన్న సురక్ష వైద్యశిబిరంలో 466 మందికి వైద్యసేవలు అందంచినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం, ఎంపీడీవో వెంకటరావు, వైద్యాధికారి డా.గాయత్రి, సీడీపీవో బాలచంద్రమణి దేవి, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు శామ్యూల్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.సింహాచలం పాల్గొన్నారు.

జగనన్నకు రుణపడి ఉంటా



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం వల్ల వైద్యసేవలు చేరువయ్యాయి. ఈ పథకం వల్ల ఎంతో మేలు జరిగింది. కంటి సమస్య ఉంది. పైసా ఖర్చులేకుండా కొద్దిరోజుల్లో శస్త్ర చికిత్స చేస్తామన్నారు. జగనన్నకు రుణపడి ఉంటా.

– రేగం చిన్నకర్రన్న, సంపంగిపుట్టు,శోభకోట

క్లుప్తంగా

క్రీడల్లో రాణించేలా ప్రోత్సాహం

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించేలా ప్రోత్సహిస్తున్నామని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. ఎవరెస్ట్ శిఖరం అధిరోహించేందుకు ఎంపికైన మారేడుమిల్లి ఏకలవ్య పాఠశాల విద్యార్థినులు కుంజం సుస్మిత, కుర్ల సౌజన్యలను మంగళవారం తన చాంబర్‌లో పీవోతో పాటు సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఏఎస్పీ జగదీష్ అడహల్లి, డీఎఫ్‌వో నరేంద్రియన్ అభినందించారు. ముందుగా వీరు హిమాచల్ ప్రదేశ్‌లోని కులుమనాలీలో 15 వేల అడుగుల పర్వత శిఖరాన్ని అధిరోహిస్తారని వారు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థినులకు ప్రభుత్వపరంగా పోత్సాహం అందిస్తామని పీవో, సబ్‌కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఫీడర్ అంబులెన్సులో ప్రసవం

- తల్లీబిడ్డ క్షేమం


తల్లీ బిడ్డలతో వైద్యసిబ్బంది

పెదబయలు: ఫీడర్ అంబులెన్సులో ఆస్పత్రికి తరలిస్తుండగా గర్భిణి మార్గం మధ్యలో ప్రసవించింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గోమంగి పంచాయతీ కుంతురుపుట్టులో గర్భిణి పాంగి తిలకమ్మకు పురిటినొప్పులు మంగళవారం ఎక్కువయ్యాయి. వెంటనే ఆమెను ఫీడర్ అంబులెన్సులో పీహెచ్‌సీకి తరలిస్తుండగా ఆమె మార్గంమధ్యలో సుఖ ప్రసవం అయింది. వెంటనే ఈ విషయాన్ని ఫీడర్ అంబులెన్సు సిబ్బంది పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి తెలిపారు. వెంటనే వారు వచ్చి తల్లీబిడ్డను గోమంగి పీహెచ్‌సీ అంబులెన్సులో తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగానే ఉన్నారని ఈఎన్‌టీ కూడ శివబాబు, ఆశా కార్యకర్త తెలిపారు.

మారేడుమిల్లిలో బాలింత మృతి


బేబిరాణి మృతదేహం

మారేడుమిల్లి : మండల కేంద్రమైన మారేడుమిల్లికి చెందిన బాలింత మంగళవారం మృతి చెందింది. మండలంలోని చట్లవాడ పంచాయతీ పొట్లవాడ గ్రామానికి చెందిన పల్లాల బేబిరాణి (28), స్థానిక అద్దరివీధికి చెందిన పల్లాల అజిత్ కుమార్‌తో గతంలో వివాహం జరిగింది. వారం రోజుల క్రితం బేబిరాణి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఆమె ఒక్కసారిగా ఉదయం ఇంట్లో కళ్లు తిరిగి పడిపోవడంతో బంధువులు స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి 108లో రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది.

ఇకపై డిజిటల్ కార్డులే!

- ఆరు నెలలుగా నిలిచిన డీఎల్, ఆర్‌సీ కార్డుల జారీ
- ఇలాంటివి జిల్లాలో సుమారు 15 వేలు
- వీటి పంపిణీకి రవాణా శాఖ సన్నాహాలు
- రెండు మూడు రోజుల్లో ముద్రణ మొదలు
- డిజిటల్ కార్డుల రాకతో ఫీజు వసూలుకు స్వస్తి


డిజిటల్ డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్

సాక్షి, విశాఖపట్నం: రవాణా శాఖ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది. దీంతో డ్రైవింగ్ లైసెన్సు (డీఎల్), వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ) కార్డుల జారీ సులభతరం కానుంది. ఇకపై పాత (ప్లాస్టిక్) కార్డుల జారీ నిలిచిపోనుంది. వాటి స్థానంలో డిజిటల్ రూపంలోనే అందుబాటులోకి రానున్నాయి. దాదాపు ఆరు నెలలుగా రవాణా శాఖ ఈ కార్డులను జారీ చేయడం లేదు. విశాఖ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ (డీటీసీ) పరిధిలో రోజుకు సగటున 150 వరకు ఆర్సీలు, డ్రైవింగ్ లైసెన్సులు జారీ అవుతుంటాయి. ఇలా గత ఆరు నెలల్లో 15 వేల వరకు ఈ కార్డులను పంపిణీ చేయాల్సి ఉందని అంచనా వేస్తున్నారు. కార్డుల ముద్రణకు వీలుగా రవాణా శాఖ ప్రింటర్లను సిద్ధం చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో వీటి ముద్రణ ప్రక్రియను పాత విధానంలో చేపట్టనున్నారు. అనంతరం దశలవారీగా ఈ కార్డులను ఇప్పటికే ఫీజు సొమ్ము చెల్లించిన సంబంధిత వ్యక్తుల చిరునామాలకు పోస్టల్ ద్వారా పంపించనున్నారు. అప్పటి వరకు ట్రాఫిక్ పోలీసులు గాని, రవాణా శాఖ అధికారులు గాని తనిఖీ చేసేటప్పుడు డిజిటల్ ఫార్మాట్‌లో ఉన్న కార్డులను చూపిస్తే సరిపోతుందని రవాణా శాఖ ఉప కమిషనర్ జీసీ రాజారత్నం తెలిపారు. మొబైల్ ఫోన్ లేని వారు కార్డులను ప్రింట్ చేయించుకుని తమతో పాటు ఉంచుకోవాలని ఆయన కోరారు.

నిలిచిన ఫీజుల వసూలు

ఇప్పటివరకు డ్రైవింగ్ లైసెన్స్/ఆర్సీ కార్డు జారీకి ఫీజు కింద రూ.200, పోస్టల్ చార్జీ కింద రూ.25 చొప్పున రవాణా శాఖ వసూలు చేస్తోంది. ఈ మొత్తం చెల్లించిన వారికి సంబంధిత కార్డులను పోస్టల్ ద్వారా పంపిస్తోంది. అయితే జులై 29 నుంచి ఈ ఫీజుల వసూలును నిలిపి వేసింది. మరోవైపు విశాఖ జిల్లాలో గతంలో ముద్రించిన కార్డులను పోస్టల్ ద్వారా పంపిస్తే ఆ చిరునామాల్లో సంబధిత వ్యక్తులు అందుబాటులో లేకపోవడంతో వాటిలో కొన్ని వెనక్కి వచ్చేశాయి. ఇప్పుడు 2022 ఆగస్టు నుంచి 2023 ఆగస్టు వరకు ఈ కార్డులు అందని వారి కోసం తమ ఆధార్ కార్డులతో వచ్చి రవాణా శాఖ కార్యాలయాల్లో తీసుకునే వెసులుబాటు కల్పించారు.

ఇక డిజిటల్ రూపంలో..

కొత్త నిబంధనల ప్రకారం ఇకపై డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్సీలను కార్డుల స్థానంలో డిజిటల్ రూపంలోనే (కాగితం రహిత) జారీ కానున్నాయి. ఇక మీదట వీటి కోసం ఎవరూ ఆర్టీవో కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం రాదు. మునుపటిలా కార్డుల జారీకి ఫీజు సొమ్ము చెల్లించాల్సిన పని కూడా ఉండదు. ఇందుకోసం కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ (మోర్త్) రూపొందించిన sasathipasivahan.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది. నిర్ణీత వ్యవధిలో డిజిటల్ కార్డు జారీ అవుతుంది. వీటిని డిజి లాకర్‌లోనూ భద్రపరచుకోవచ్చు. ప్లాస్టిక్ కార్డుపై ముద్రించుకోవచ్చు. ప్రభుత్వం తీసుకున్న సరికొత్త నిర్ణయంతో డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్సీ కార్డులు పొందే వారికి ఫీజు భారం తప్పుతుంది. వీటి జారీ కూడా సులభతరం అవుతుండడంతో వాహనదారులకు ఊరట లభించనుంది.

పకడ్బందీగా ఓటర్ల జాబితా సవరణ


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ విశ్వనాథన్, డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీవోలు

మహారాణిపేట: ఓటరు జాబితా సవరణ–2024ను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా రూపొందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. రాజకీయ పార్టీలు సమర్పించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, చనిపోయిన, డూప్లికేట్, బదిలీ, నకిలీ ఓటర్ల జాబితా పరిశీలన, ఎపిక్ కార్డు జనరేషన్, తదితర అంశాలపై మంగళవారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. జిల్లాలో ఎన్నికల జాబితా సవరణ–2024 ప్రగతిపై జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయనకు వివరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి డీఆర్వో కె.మోహనరావు, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు, ఎస్డీసీలు పాల్గొన్నారు.

నేడు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పర్యటన

మహారాణిపేట: కేంద్ర సమాచార శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ బుధవారం విశాఖలో పర్యటించనుంది. కమిటీ చైర్‌పర్సన్ ప్రతాప్‌రావ్ జాదవ్ అధ్యక్షతన 20 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ సభ్యుల బృందం పర్యటించనుంది. బుధవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు బీఎస్ఎన్ఎల్, రైల్‌టెల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, భారతీ ఎయిర్‌టెల్, భారతీ ఎక్సాకామ్, రిలయన్స్, జియో సంస్థల ప్రతినిధులతో కమిటీ సభ్యులు సమావేశం కానున్నారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఎంఈఐటీవై), హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ టెస్ట్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రతినిధులతో సమావేశం కానున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు సెంటర్ ఫర్ మెటీరియల్స్ ఫర్ ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ (సీ మెట్) ప్రతినిధులతో భేటీ కానున్నారు. రాత్రికి విశాఖలో బస చేస్తారు. 5వ తేదీన ఉదయం 10.30 గంటలకు ఇండిగో విమానంలో తిరుపతి వెళ్తారు.

ఆస్పత్రుల్లో పింఛన్ అందజేత


కేజీహెచ్‌లో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సుమన్

దుంబ్రిగుడ: మండలంలోని కొర్రాయి పంచాయతీ తోటవలస గ్రామానికి చెందిన గుంట డొంబు అనారోగ్యం కారణంగా కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ సమాచారం తెలుసుకున్న గ్రామ వలంటీర్ సీహెచ్ సుమన్ మంగళవారం కేజీహెచ్‌కు వెళ్లి పింఛన్ అందజేశాడు. దీంతో డొంబు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.


కాకినాడలో చికిత్స పొందుతున్న వ్యక్తికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

కాకినాడలో...

గంగవరం : కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బి.శివరామపట్నం గ్రామానికి చెందిన మడకం సూరన్నదొర అనే వృద్ధుడి వద్దకు ఆ గ్రామానికి చెందిన గ్రామ వలంటీరు లోవలక్ష్మి వెళ్లి పింఛన్ అందజేశారు. ఆమెను మొల్లేరు సర్పంచ్ లక్ష్మి, వైస్ఎంపీపీ రామతులసి అభినందించారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: సీఎం జగన్‌మోహన్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యమిస్తూ పలు కార్యక్రమాలు ప్రవేశపెడుతున్నారని, వీటిని విద్యార్థులంతా అందిపుచ్చుకోవాలని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మంగళవారం ఆమె స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల–2ను తనిఖీ చేశారు. ఆంగ్ల మీడియంలో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఏపీలో చదువుల విప్లవాన్ని సీఎం జగన్ మోహన్ రెడ్డి తీసుకొచ్చారని, కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తగ్గకుండా నాడు నేడులో సదుపాయాల కల్పనతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సీతమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు జగబంధు. మండల నాయకులు మల్లికార్జునరావు, సర్పంచ్‌లు, రమేష్, నీలకంఠం, గంగాధర్ ఎంపీటీసీలు సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ తరహా సదుపాయాలు


బందవీధి ఆశ్రమ పాఠశాలో డిజిటల్ తరగతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి


బందవీధి ఆశ్రమ పాఠశాలలో వంటకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కార్పొరేట్ తరహా సదుపాయాలను కల్పిస్తున్నట్టు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలో కె.కోడాపల్లి పంచాయతీ బందవీధి గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించారు. పాఠశాలలో విద్యార్థినుల సామర్థ్యం, డిజిటల్ విద్యాబోధనను ఆమె పరిశీలించారు. వంటశాలను తనిఖీచేసి, వంటకాలను రుచిచూశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలు కల్పించారని, వాటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నతస్థానాలకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, ఎంపీటీసీలు గబ్బాడి సన్యాసిదొర, చిన్నారావు, సర్పంచ్‌లు మాతే చిలకమ్మ, సీదరి కొండబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎస్.మత్స్య కొండంనాయుడు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు నాగూరుబాబు,ఎగ్జిక్యుటివ్ మెంబర్ పి.రామకృష్ణ పాల్గొన్నారు.

మంత్రి రజిని పర్యటనను విజయవంతం చేయండి


అధికారులతో మాట్లాడుతున్న పాడేరు పీవో అభిషేక్

దుంబ్రిగుడ: మండలంలో బుధవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పర్యటించనున్నారని, ఆ పర్యటనను విజయంతం చేయాలని ఐటీడీఏ పీవో అభిషేక్ అధికారులను ఆదేశించారు. అరకు పంచాయతీ జైపూర్ జంక్షన్ వద్ద ఉన్న గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల ఆవరణంలో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మంత్రి పాల్గొనున్నారని ఆయన తెలిపారు. ఆ ఆశ్రమ పాఠశాలను పీవో మంగళవారం సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో ఉషారాణి, వైద్యులు కరుణ, ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు, ఎస్ఐ సంతోష్‌కుమార్ ఉన్నారు.

మిర్చికి బొబ్బ తెగులు

- ఆందోళనలో రైతులు
- వందల ఎకరాల్లో మొక్కలను తొలగిస్తున్న వైనం
- వాతావరణ మార్పుతో తీవ్ర ప్రభావం


బొబ్బ తెగులు సోకిన మిర్చి మొక్కలను తొలగిస్తున్న కూలీలు


బొబ్బ తెగులు సోకిన మిర్చి మొక్క

ఎటపాక: మిర్చి సాగు ప్రారంభంలోనే రైతులకు ఆటంకాలు మొదలయ్యాయి. ఎంతో ఆశతో సాగు చేస్తున్న వాణిజ్య పంట ప్రతి రైతులను కంటతడి పెట్టిస్తోంది. మిర్చి తోటలకు బొబ్బ తెగులు సోకడంతో పచ్చని మొక్కలు ముడుచుకుపోతున్నాయి. జులై నెల నుంచి మిర్చి నారుమడులు తయారు చేసుకుని గోదావరి వరదలు తగ్గడంతో సెప్టెంబర్ ప్రారంభం నుంచి పొలాల్లో మొక్కలు నాటుతున్నారు. అయితే నెలరోజుల వ్యవధిలోనే బొబ్బ తెగులు రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. మండలంలో అత్యధికంగా ఈఏడాది ఎనిమిది వేల ఎకరాల్లో మిర్చి సాగు చేస్తున్నట్టు అంచనా.

మొక్కలు తొలగిస్తున్న రైతులు

వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేస్తున్న మిర్చి పంట ఆదిలోనే కష్టాలు తెచ్చిపెట్టింది. లావు రకాల (341,211,ఆర్మూరు,4884,ఎండేన్‌ఫైవ్) మిర్చి నారుకు బొబ్బతెగులు విపరీతంగా ఉంది. పొలాల్లో నాటిన 20 రోజుల్లోనే మొక్కల్లో ఈ తెగులు కనపడుతోంది. ఈ తెగులు నియంత్రణ కాకపోవడంతో చేసేదిలేక బొబ్బ ఉన్న మొక్కలను చేలల్లో నుంచి పీకేస్తున్నారు. మరికొందరు పొలాన్ని దున్నేస్తున్నారు. మండలంలోని నెల్లిపాక, తోటపల్లి, పిచుకలపాడు,రాయనపేట, గన్నవరం, గౌరీదేవిపేట, నందిగామ,మురుమూరు తదితర ప్రాంతాల్లో ఇప్పటికే వందల ఎకరాల్లో బొబ్బ తెగులు ఉన్న మిర్చి మొక్కలను తొలగించారు. మొక్కలు తొలగించిన చోట మళ్లీ మిర్చి మొక్కలు నాటుకుంటున్నారు. డ్రిప్ పద్ధతిలో సాగు చేస్తున్న పొలాల్లో సైతం ఈ తెగులు విజృంభిస్తోంది.

ఆదిలోనే రైతులకు తీవ్ర నష్టం

ఈఏడాది మిర్చి సాగు రైతులకు ఇబ్బందులు తప్పేటట్టులేవు. కిలో మిర్చి విత్తనాలకు రూ.లక్షకు పైగా వెచ్చించి కొనుగోలు చేసి నారుమడులు తయారు చేసుకున్నారు. పొలంలో మొక్కలు నాటిననాటి నుంచి ఇప్పటి వరకు దుక్కులు,కూలీల ఖర్చు,ఎరువులు,పురుగు మందులకు ఎకరాకు సుమారు రూ.60వేల వరకు పెట్టుబడులు పెట్టారు. అయితే బొబ్బ తెగులు సోకిన మొక్కలు తొలగించి వాటి స్థానంలో మళ్లీ మొక్కలు నాటుకోవాలంటే పెట్టుబడులు అధికమవుతున్నాయి. ఇందుకోసం ఒక్కో మొక్కకు రూ.1.50పైసలు చొప్పున చెల్లించి నర్సరీల్లో కొనుగోలు చేస్తున్నారు. వాతావరణంలో విపరీతమైన వేడి కారణంగానే ఈ తెగులు వస్తుందని అంటున్నారు. గతరెండేళ్ల మాదిరిగా ఈఏడాది మిర్చి తోటలు పూత పిందె దశలో ఉన్నప్పుడు తామరపురుగు,నల్లి సోకితే తీవ్రనష్టాన్ని చవి చూడాల్సిందేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మినీ వ్యాన్ బోల్తా.. ఒకరి మృతి

రంపచోడవరం : సుద్దగొమ్మి వద్ద మినీ వ్యాన్ బోల్తా పడడంతో ఒక వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోక్సుపేట పంచాయతీ సుద్దగొమ్మి సమీపంలో రంపచోడవరం వైపు నుంచి గోకవరం వెళ్లతున్న మినీ వ్యాన్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. 108 సహాయంతో రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గురుకుల కళాశాల విద్యార్థి ఆత్మహత్య


పృథ్వీ మృతదేహం

కొయ్యూరు : కాకరపాడు గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ (బైపీసీ) ద్వితీయ సంవత్సరం చదువుతున్న కిముడు లక్ష్మణ్ పృథ్వీ(17) మంగళవారం సాయంత్రం రాజేంద్రపాలెంలో బంధువుల ఇంటి వద్ద ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిట్టు ఎస్ఐ రాజారావు తెలిపారు. కాకరపాడు గురుకుల కళాశాలలో చదువుతున్న పృథ్వీ రాజేంద్రపాలెంలో బంధువులైన పురం అప్పారావు ఇంటి వద్ద ఉంటున్నాడు. మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత కొంత సేపు బయట తిరిగిన పృథ్వీ ఇంట్లోకి వెళ్లి ఉరివేసుకున్నాడని చెబుతున్నారు. అతని ఆత్మహత్యకు కారణాలు తెలియలేదు. తలుపులు తీసుకుని లోపలకు వెళ్లిన బంధువులు వెంటనే పృథ్వీని రాజేంద్రపాలెం ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మరణించినట్టుగా వైద్య సిబ్బంది నిర్ధారించారు. సమాచారం తెలుసుకున్న కొయ్యూరు ఎస్ఐ రాజారావు వెంటనే ఆస్పత్రికి వచ్చి విద్యార్థి మృతదేహాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థికి సంబంధించిన విషయాలను వారి స్నేహితుల ద్వారా సేకరిస్తున్నామన్నారు. అతని ఫోన్‌ను పరిశీలిస్తామన్నారు. జీవితంపై విరక్తి కలిగి ఇలా చేసి ఉండవచ్చనిభావిస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి పంపించి పూర్తి వివరాలు తెలుసుకుంటామన్నారు. ఆయన వెంట మంప ఎస్ఐ లోకేష్‌కుమార్ పాల్గొన్నారు

నెల రోజులుగా కళాశాలకు రావడం లేదు

కళాశాలకు పృథ్వీ నెల రోజులుగా రావడం లేదని ప్రిన్సిపాల్ సూరిబాబు తెలిపారు. కళాశాలకు సరిగా రావడం లేదని గతంలో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామన్నారు. అనేకసార్లు కౌన్సెలింగ్ కూడా ఇచ్చామన్నారు. జి.మాడుగులకు చెందిన పృథ్వీ ఇక్కడ బంధువుల ఇంటి వద్ద ఉంటున్నాడన్నారు.

చిరు ధాన్యాల ఉత్పత్తి యూనిట్‌కు
నేడు సీఎం జగన్ శంకుస్థాపన

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో చిరు, తృణ ధాన్యాల ఉత్పత్తి యూనిట్ నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఈ యూనిట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం , స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ రూ.4.46 కోట్లు మంజూరు చేసింది. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు పద్మనాభం మండల పరిషత్ కార్యాలయంలో తగిన ఏర్పాట్లు చేశారు. మాజీమంత్రి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కలెక్టర్ ఎ.మల్లికార్జున తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని రాష్ట్ర ఆహార శుద్ధి సొసైటీ జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.ఎ.రహీమ్ తెలిపారు.

అయ్యన్న నోటి దురుసు

దాని పేరేమి పేరు.. అని బ్రాహ్మణి గురించి ప్రస్తావన..
లోకేష్ భార్య బాలకృష్ణ చిన్న కూతురా.. పెద్ద కూతురా.. అని వ్యాఖ్య
పేరు గుర్తుకురాక మీడియా ముందు నానా తంటాలు..
అవాక్కయి బిత్తర చూపులు చూసిన టీడీపీ నేతలు..

ఇదీ మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు మీడియాతో అసభ్యంగా, అడ్డదిడ్డంగా మాట్లాడిన మాటల పర్యవసానం. టీడీపీలో మహిళలకు గౌరవం లేదన్న విషయం చర్చనీయాంశం అయిన దశలో.. అయ్యన్న అవాకులు చవాకులు నష్టం చేకూరుస్తాయని సొంత పార్టీ వారే నొసలు చిట్లిస్తున్న వైనం..



సాక్షి, అనకాపల్లి: ఎప్పుడూ ఏదో ఒక వివాదంలో కనిపించే మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు నోటి దురుసుతనం మరోసారి సంచలనమైంది. ఈసారి స్వయానా టీడీపీ అధినేత చంద్రబాబు కోడలు, చినబాబు లోకేష్ భార్య, బాలకృష్ణ పెద్ద కూతురు బ్రాహ్మణినే అవమానిస్తూ..హేళన చేస్తూ మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజున చంద్రబాబు అరెస్టుకు నిరసనగా నర్సీపట్నం టౌన్‌లో

ఏర్పాటు చేసిన టీడీపీ మహిళా దీక్షా కార్యక్రమంలో అయ్యన్న మీడియాతో మాట్లాడుతూ.. 'బాలకృష్ణ చిన్న కూతురా.. లేదా పెద్ద కూతురా.. దాని పేరేమిపేరు..' అంటూ తన సహజసిద్ధమైన రీతిలో అసహ్యకరంగా మాట్లాడారు. ప్రస్తుతం టీడీపీలో కీలకపాత్ర పోషిస్తున్న నారా బ్రాహ్మణి పేరు గుర్తుకురాక మీడియా ముందు అయ్యన్న నానా తంటాలు పడ్డారు. ఒక సీనియర్ మాజీ మంత్రి అలా అవహేళన చేసి మాట్లాడడంతో అక్కడున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు బిత్తర చూపులు చూస్తూ ఉండిపోయారు. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ తమ్ముళ్లు అయ్యన్నపై గుర్రుగా ఉన్నారు. చంద్రబాబుని జైలు పాలు చేసిన స్కిల్ స్కాంకు తనకు ఎటువంటి సంబంధం లేదని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు చెప్పకనే చెప్పారు. ఇప్పుడు మరో సీనియర్ నేత అయ్యన్న అధినేత కోడలినే హేళన చేసి మాట్లాడారు. ఇవన్నీ చూస్తుంటే టీడీపీ మాజీ మంత్రులు, సీనియర్ నేతలకు పార్టీ అధిష్టానంపై ఎంత గౌరవం ఉందో అర్థం అవుతోంది. ఇక సొంత పార్టీలోనే కొందరు టీడీపీ మహిళా నేతలు.. అయ్యన్నపాత్రుడికి ఆడవారిని గౌరవించడం రాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయ్యన్నపాత్రుడు నోటి దురుసుకు చెక్ పెట్టకపోతే పార్టీ నష్టపోయే ప్రమాదముందని సీనియర్ నేతలు మధనపడుతున్నట్టు సమాచారం. ఇప్పటికే ఇద్దరు సీనియర్ మాజీ మంత్రులు మాట తూలారు. క్రమశిక్షణ తప్పారు. భవిష్యత్తులో మరింతమంది తలో రకంగా వ్యవహరిస్తే పార్టీ మరింత కష్టాల్లో పడుతుందన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.